

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రణస్థలం రూరల్: పైడిభీమవరం వద్ద పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పైడిభీమవరం వద్ద ఉన్న చెక్ పోస్టును కలెక్టర్‌తో పాటు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు పాక్షికంగా ఒక షెడ్ వేయాలన్నారు. అక్కడ లైటింగ్ తక్కువగా ఉందని, మరింత లైటింగ్ పెంచాలని ఆదేశించారు. వాహనాలు ఆపేందుకు స్టాపర్ ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బందిని పెంచి బలోపేతం చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద మౌలిక సదుపాయాలు పెంచాలన్నారు. ఈ తనిఖీలో ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, తహశీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

అమ్మ తినాలి.. బిడ్డ ఎదగాలి

- ఆందోళనకరంగా రక్తహీనత
- 30 శాతం గర్భిణుల్లో ఈ పరిస్థితి
- పాఠశాల స్థాయి విద్యార్థినులకూ ఇదే సమస్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

'అమ్మ'కు పౌష్టికాహారం ప్రభుత్వం నుంచి అందడం లేదు. ఫలితంగా రక్తహీనత దెబ్బ తీస్తోంది.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వీరి సంఖ్య రక్తహీనత కేసుల సంఖ్య 30 శాతానికి పైగా ఉంటోంది. ప్రధానంగా గర్భిణుల్లో సమతులాహారం తీసుకోకపోవడంతో తల్లీపిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోంది. గర్భం దాల్చిన క్రమంలో రక్తహీనత పసి ప్రాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మాతాశిశు సంరక్షణతో పాటు ఆరోగ్యకర దేశ నిర్మాణం దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర మహిళా శిశు సంరక్షణ పేరిట పెద్దఎత్తున పథకాలను నిర్వహిస్తోంది. ఈ పథకాలను సద్వినియోగ పరచుకునేందుకు గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున విస్తృత ప్రచారం చేస్తుంది. ఐసిడిఎస్ ఆధ్వర్యాన గత నెల రోజుల పాటు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. నాలుగు వారాల్లో 8 అం శాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సమతులాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. రోజువారి తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన ఉండటం లేదు.

గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ జననం వరకు మంచి ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్య వంతులైన బిడ్డలకు జన్మనిస్తున్నారు. సరైన ఆహారం తీసుకోని గర్భిణులకు రక్తహీనత బారినపడుతున్నారు. అటువంటి వారికి ప్రసవం కష్టంగా మారుతోంది. ఫలితంగా మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయి. జిల్లాలో ప్రతినెలా ఇద్దరూ లేక ముగ్గురు ఈ రకమైన మరణాల బారిన పడుతున్నారు. అనేక మంది ఆస్పత్రి పాలవుతున్నారు. దీనికి తోడు సుఖ ప్రసవాలను కాదని సిజేరియన్లకు సిద్ధమవుతున్నారు. వైద్యులు సైతం సుఖ ప్రసవాలను ప్రోత్సహించలేని పరిస్థితి నెలకొంటోంది. దీనికి తోడు పుట్టిన పిల్లలు శారీరక లోపాలతో పుడుతున్నారు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లోపిస్తోంది.

ఐసిడిఎస్ సిబ్బంది పిల్లల ఎత్తు, బరువు, చుట్టు కొలతలు యాప్లో నమోదు చేస్తున్నారు. పిల్లల పోషణ, పెరుగుదలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైతే వైద్యానికి సిఫార్సు చేస్తున్నారు. మహిళలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సాంకేతిక విధానాలు వినియోగిం చుకోవడంపై వివరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీలు ఎంత ప్రయత్నించినా గ్రామీణ ప్రాంతాల్లో వారు తీసుకుంటున్న ఆహారంలో మార్పు రావడం లేదు. జంకు ఫుడ్స్ అలవాటు ఇప్పుడు గ్రామాలకు చేరువైంది. దీనివల్ల ఆరోగ్య సమస్యలు గర్భిణుల్లో ఎక్కువవుతున్నాయి.

వ్యాయామం అలవర్చుకోవాలి

పిల్లల బరువు పెరుగుదలకు పౌష్టికాహారం అందజేయడంతో పాటు గర్భిణులు యోగా, వ్యాయామం అలవర్చుకోవాలి. వీలున్నంతం వరకు జంకు ఫుడ్స్ వినియోగాన్ని తగ్గించుకోవాలి. అనారోగ్య సమస్య తలెత్తిన వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. రక్త హీనత లేకుండా ఎక్కువగా ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలి. సమతుల ఆమారం తీసుకుంటే ప్రసవ సమయంలో ఇబ్బందులు ఉండవు.

- డాక్టర్ బి.మీనాక్షి, డిఎంహెచ్ఒ, గైనకాలజిష్టు

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

సమతులాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్య కరమైన జీవితం మన సొంతమవుతుంది. రోజువారి తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన ఉండటం లేదు. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి బిడ్డ జననం వరకు మంచి ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులైన బిడ్డలకు జన్మనిస్తారు. సరైన ఆహారం తీసుకోని గర్భిణులు రక్తహీనత బారినపడుతున్నారు. ప్రసవం కష్టంగా మారుతోంది. వారికి శారీరక లోపాలతో కూడిన పిల్లలు జన్మిస్తున్నారు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లోపిస్తోంది.

- బి.శాంతిశ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్టు, డైరెక్టర్

జెండా ఊపి కొత్త బస్‌లను ప్రారంబిస్తున్న రామ్మోహన్ నాయుడు

ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను ఆధునీకరిస్తాం

- నాలుగు నెలల్లో 11 కొత్త బస్సులు
- ఐదు కొత్త బస్సులను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం పాటు ప్రయాణికులకు నిరంతరాయంగా సేవలందిస్తున్న శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని శ్రీకాకుళం 1 డిపో పరిధిలో ఐదు కొత్త బస్సులను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేశారని అన్నారు. విలీనం పేరిట ఆర్‌టిసిని సైతం నిర్వీర్యం చేశారని, బస్‌లకు కనీస మరమ్మతులు చేయకపోగా రోడ్లన్నీ గోతులమయమై ఆర్‌టిసికి తీరని నష్టం తెచ్చి పెటారని విమర్శించారు. ఢిల్లీ నుంచి తిరుపతికి ఉన్న విమాన సర్వీసులను నిలుపుదల చేశారని, విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాను విమాన సర్వీసులను తిరిగి పునరుద్ధరించానని చెప్పారు. రాష్ట్రంలో గడచిన వంద రోజుల్లోనే ఆరు ప్రాంతాలకు కొత్తగా ఫ్లైట్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సౌకర్యార్థం మరో 1500 నుంచి 2000 బస్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. సోలార్, ఎలక్ట్రిక్ బస్సులను కూడా నడిపించేందుకు చర్చలు తీసుకున్నామని చెప్పారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు వీటిని తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన చేశారన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నగరంలో వర్షం పడితే ముందుగా మునిగి పోయేది ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాలేనని, ఈ సమస్యను పరిష్కరించేందుకు సహకారం అందించాలని కోరారు. గతంలో శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.45 లక్షలు మంజూరు చేశారని, పూర్తిస్థాయి పునర్నిర్మాణం చేపడితే తప్ప సమస్యకు పరిష్కారం ఉండదని కేంద్ర మంత్రికి వివరించారు. శ్రీకాకుళం నుంచి విజయవాడకు ఇంద్ర బస్సును పునరుద్ధరించామన్నారు. శ్రీకాకుళం 1,2 డిపోల పరిధిలో 11 బస్సులను కొత్తగా అందుబాటులోకి తెచ్చామన్నారు. మరో 30 బస్సులు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ముందుగా 1 డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎ.విజయకుమార్, డిపో మేనేజర్లు అమర సింహుడు, శర్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రన్నర్‌గా శ్రీకాకుళం యుటిఎఫ్ జట్టు

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఐక్యపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈ నెల 4,5, 6 తేదీల్లో గుంటూరులో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో రన్నర్‌గా శ్రీకాకుళం జట్టు నిలిచింది. పిచ్చుకల గుంట క్రికెట్ మైదానంలో జరిగిన ఈ పోటీల్లో 24 టీంలు పాల్గొన్నాయి. వాటిలో శ్రీకాకుళం, ఏలూరు జట్లు చివరి లీగ్ మ్యాచ్‌లో పోటీపడ్డాయి. ఓవరాల ఛాంపియన్ షిప్‌ను ఏలూరు జట్టు దక్కించుకోగా, రన్నర్‌గా శ్రీకాకుళం జట్టు నిలిచిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తెలిపారు. విజేతలను ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని, శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కేశవరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు, జీవితంలో కష్టసుఖాలను తట్టుకునేలా ధైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మోడల్ అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు పాఠశాల ప్లే గ్రౌండ్ మంజూరుకు చర్యలు చేపడతానని హామీఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్ ఎస్‌బిడి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలకు సంబంధించి నిధులు జిల్లాకు మంజూరు కాలేదన్నారు 48 గంటల్లో అన్ని జిల్లాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యలో క్రీడలు అంతర్భాగమని పేర్కొన్నారు. నాణ్యమైన స్పోర్ట్స్ కిట్లను అన్ని పాఠశాలకు అందజేస్తామన్నారు త్వరలో రాష్ట్రాల్లో మెగా స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిజెపి నాయకులు పైడి వేణుగోపాలం మాట్లాడుతూ స్థానికంగా జూనియర్ కళాశాల మంజూరు చేస్తే చుట్టుపక్కల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థానిక పీడీ, ఇపిడిపి అధ్యక్షులు ఎన్.వి.రమణ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించమన్నారు. గ్రామ సర్పంచ్ పైడి భాస్కరరావు, ఎంపిటిసి సూర జగదీశ్వరరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావులు మాట్లాడుతూ క్రీడామైదానం, జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఒ తిరుమల చైతన్య, ఎంఇఒ కారు పున్నయ్య, జనసేన నాయకులు విశ్వేశ్వర్, టిడిపి మండల అధ్యక్షులు బెండు మల్లేష్, పైడి ముఖలింగం, లీగల్ సెల్ అధ్యక్షులు అన్నెపు భువనేశ్వర్, కొత్తకోట అమ్మినాయుడు చౌదరి, అవినాష్, పొన్నాడ అప్పలనాయుడు, తమ్మినేని శ్రీనివాస్, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియాలో అ'ద్వితీయం'

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆలిండియా యోగా పోటీల్లో జిల్లాలోని జలుమూరు మండలం లింగన్నాయుడుపేటకు చెందిన రావాడ రోహిణి అద్వితీయమైన ప్రదర్శనతో రాణించింది. ఇటీవల చత్తీష్‌ఘడ్ రాష్ట్రం బిలాయ్ వేదికగా జరిగిన ఆలిండియా పోలీస్ క్లస్టర్ యోగా పోటీల్లో రోహిణి పాల్గొని రజత పతకం సాధించింది. ఈమె తూర్పుగోదావరి జిల్లా పోలీస్‌శాఖలో సైబర్ ల్యాబ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఈమె గతంలో విశాఖపట్నం, జలంధర్, నాగూర్లో నిర్వహించిన ఆలిండియా పోలీస్ యోగా పోటీల్లో తృతీయ, చతుర్ధ స్థానాలను కైవసం చేసుకుంది. పోటీల్లో పాల్గొన్న ప్రతిసారి విజయాలు సాధిస్తున్న రోహిణిని డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావు, స్పోర్ట్స్ ఐజి, తూర్పుగోదావరి ఎస్‌పి డి.నరసింహాకిశర్, అదనపు ఎస్‌పి అల్లూరి వెంకటసుబ్బరాజు అభినందించారు.

అభినందిస్తున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

పారదర్శకంగా ఇసుక సరఫరా

- అందుబాటులో ఆరు వేల మెట్రిక్ టన్నులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు
- ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పంపిణీ విధానం జిల్లాలో చట్టబద్ధంగా, సజావుగా, సులభతరంగా సాగేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇసుక కొరత లేదని, ప్రస్తుతానికి ఆరు వేల మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇసుక బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సరఫరా చేస్తున్నామని వివరించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలను నిర్వహించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 16 నుంచి జిల్లాలో కొత్తగా ఆరు ఇసుక రీచ్‌లను ప్రారంభించి, పూర్తిగా అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. మరికొన్ని కొత్త రీచ్‌లను, డీసిల్టింగ్ కేంద్రాలను గుర్తించామని, అవీ త్వరలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా కేటాయించామని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు ఎవరైనా https://www.sand.ap.gov.inలో బుక్ చేసుకోవచ్చని, లేదంటే వారి సమీపంలోని సచివాలయానికి వెళ్లి బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారులు సొంతంగా వాహనం తెచ్చుకుంటే, దానిలో ఇసుక నింపి తీసుకువెళ్లవచ్చని, అలాగే జిల్లాలో ఆర్‌టిఒ వద్ద నమోదు చేసుకున్న, జిపిఎస్ విధానంతో అనుసంధానించి వాహనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వీటి ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీలను చెల్లించి ఇసుకను తీసుకువెళ్లవచ్చునని సూచించారు. ఇసుక తవ్వకాలు, సరఫరా, రవాణాపైనా నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. థర్డ్ పార్టీ ద్వారా కూడా ఇసుక సరఫరాపై నిఘా ఉంచుతున్నామన్నారు. ఇసుక పొందడంలో సమస్యలు ఎదురైతే, 24 గంటలూ పనిచేసే జిల్లాస్థాయి ఫెసిలిటేషన్ సెంటర్‌ను సంప్రదించవచ్చునని చెప్పారు. అలాగే టోల్ ఫ్రీ నంబరు 18004256012, వాట్సాప్ నంబరు 9701691657ను సంప్రదించవచ్చని అన్నారు.

ఎస్‌పి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినా, అక్రమంగా ఇసుకను రవాణా చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరికి భారీగా జరిమానా విధించడంతోపాటు, కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకు అక్రమార్కులపై రూ.5.75 లక్షలు జరిమానా విధించామన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. సమావేశంలో శ్రీకాకుళం ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి కృషి

ఎపిటిపిసి చైర్మన్ బాబూరావు

మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలోని ఉన్న పరిశ్రమలు, కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, పోర్టులకు అనుసంధానంగా పది ఎకరాల విస్తీర్ణంలో వేర్ హౌస్ గోదాములు నిర్మించి తమ సంస్థకు ఆదాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఎపిటిపిసి) చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారిగా పలాస-కాశీబుగ్గ వచ్చిన ఆదివారం తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎపి నిర్మన్ యాప్ ద్వారా మొత్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమశాఖ పరిధిలో రాష్ట్రంలో ఆదాయం ఇచ్చే సంస్థలు అనేకంగా ఉన్నాయని అన్నారు. విశాఖపట్నంలో అధికంగా గోదాములు, షాపింగ్ మాల్స్ ఉన్నాయని, వాటి ద్వారా రూ. లక్షల రూపేనా అద్దెలు వస్తున్నాయన్నారు. విశాఖపట్నం నడిబొడ్డులోని స్పెన్సర్ షాపింగ్ మాల్‌కు సంబంధించి లీజు గడువు పూర్తయిందని అన్నారు. కొత్త లీజుకు ఇవ్వడానికి టెండర్లు పిలవగా అదనంగా ఆదాయం వచ్చిందని అన్నారు. అయితే దీన్ని తమకే కేటాయించాలని సంబంధిత సంస్థ కోర్టుకు వెళ్లడంతో టెండరు ఆగిందని తెలిపారు. తొందరలో కోర్టు వివాదాలు అధికమించి ప్రభుత్వానికి అదనపు ఆదాయం తీసుకువస్తామన్నారు. తిరుపతి, విజయ వాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ట్రేడ్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. అందులో తమ సంస్థ చేసే కార్యక్రమాలపై, ప్రోత్సాహకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమశాఖ ద్వారా కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించడానికి ప్రతిపాదనలు ఉన్నాయని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి వాటి నిర్మాణానికి తగు స్థలాలు సేకరిస్తామని తెలిపారు. అన్నీ ప్రభుత్వ పాఠశాలలకు, కార్యాలయాలకు న్యూస్ ప్రింట్, స్టేషనరీ అందిస్తామని, లేపాక్షి, నంది పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీంతో పాటుగా భూమి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, జిల్లాలో కనీసం 50 ఎకరాల మేరకు భూములు సేకరించి వాటిని ప్రమోషన్ చేస్తామని అన్నారు. దీనివల్ల సంస్థకు భారీస్థాయి ఆదాయం వస్తుందని, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉమ్మడి ఆంధ్రా ఉన్న ఎపిటిపిసి సంస్థ బలీయంగా ఉండేదన్నారు. రాష్ట్ర విభజనతో ఆస్తులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. దీన్ని పరిపుష్టి చేయడానికి పూర్తి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి
- అదుపులో డెంగీ, మలేరియా
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు
- డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. శీతల గాలులు మొదలైన తర్వాత వ్యాధులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకు అప్రమత్తంగా ఉండి దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 64 డెంగ్యీ కేసులు నమోదైనట్టు తెలిపారు. డెంగీ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే చేపడుతున్నామని అన్నారు. అందువల్ల జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగీ సోకిందన్న భావన సరికాదన్నారు. జిల్లాలో గతంలో ఏజెన్సీ ప్రాంతానికి పరిమితమైన మలేరియా జ్వరాలు ఇప్పుడు మైదాన, తీర ప్రాంత గ్రామాల్లో వాప్తి చెందుతున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో అప్రమత్తం చేస్తున్నామని ముఖాముఖిలో 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? వ్యాధుల నియంత్రణపై తీసుకున్న చర్యలు ఏమిటి?

జిల్లాలో ఈ ఏడాది సీజనల్ వ్యాధులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది డెంగీ, మలేరియా కేసుల సంఖ్య పెరిగింది. అధిక వర్షాలు, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం తదితర కారణాల వల్ల దోమలు పెద్ద ఎత్తున పెరిగాయి. దోమల నియంత్రణా చర్యలు చేపట్టేందుకు వీలుగా గ్రామాల్లో సైతం ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఎఎన్‌ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు అందుబాటులో ఉన్నారు. సచివాల యాల పరిధిలో దోమల నియంత్రణకు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాం.

? డెంగీ, మలేరియా వ్యాప్తికి అడ్డుకట్ట ఎలా సాధ్యం?

జిల్లాలో గతేడాది ఈ సీజన్‌లో 28 డెంగీ కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటివరకు 64 కేసులు నమోదయ్యాయి. మరణాల సంఖ్య తక్కువగానే ఉన్నా... జ్వర పీడితుల సంఖ్య అధికంగానే ఉంది. అక్టోబరు తర్వాత డెంగీ జ్వరాల శాతం కొంత మేరకు తగ్గుముఖం పడుతుంది. అలాగే మలేరియా కేసులు గతేడాది 86 కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటివరకు 190 వరకు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతుందని భావిస్తున్నాం.

? క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు అమలు ఎలా ఉంది?

జిల్లావ్యాప్తంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు-2002 నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్‌ఎంపి, పిఎంపిలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అబార్షన్లు, ఐవి ఫ్లూయిడ్స్, ఇంజిక్షన్లు చేస్తున్నారు. అవి వికటించి ప్రాణహాని కలిగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్, విజయవాడ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని పిఎంపిలు, ఆర్‌ఎంపిలపై చర్యలు తీసుకుంటాం. వారి సంఘం ఇచ్చే ధ్రువపత్రం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చేత ధ్రువీకరించబడలేదు. అందువల్ల వారు ఎటువంటి అల్లోపతిక్ వైద్యం చేసేందుకు అర్హులు కాదు. జిల్లాలోని పిఎంఆర్‌పిలు, ఆర్‌ఎంపిలు డ్రెస్సింగ్ చేసి కట్లు కట్టుడం, ప్రథమ చికిత్స చేసేందుకు నివారించగల వ్యాధులకు ముందస్తు సలహాలు, ప్రభుత్వాస్పత్రులకు వెళ్లేందుకు సూచనలు ఇచేందుకు మాత్రమే అర్హులు. నిబంధనలు అతిక్రమిస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు 2002 ప్రకారం చట్టపరంగా క్రిమినల్ చర్యలు తప్పవు.

? టీకాల సరఫరా ఎలా ఉంది?

జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలకు ఇవ్వాల్సిన అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయి. బిసిజి అందుబాటులో ఉంది. ఈ టీకా టిబి రాకుండా చేస్తుంది. హెపటైటస్, ఇతర రకాల వాక్సిన్ అందుబాటులోనే ఉన్నాయి. క్రమం తప్పకుండా వాక్సిన్ ప్రక్రియ కొనసాగుతోంది.

? మాతా-శిశుమరణాలు తగ్గుముఖం పట్టాయా?

మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వం కిల్కారి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమి సేవలపై అవగాహన కల్పించాం. కిల్కారి సేవల్లో వాయిస్ కాల్స్ సేవలతో మాతా శిశు ఆరోగ్యానికి భద్రత, గర్భిణులు, బాలింతలు శిశువుల ఆరోగ్యం పరిరక్షించుకునేందుకు దోహదపడుతుంది. మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా కేంద్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. గర్భిణులు, బాలింతలు మొబైల్‌కు డాక్టర్ అనిత వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. కాల్ సమయం సుమారు 1 నిమిషం 30 సెకండ్లు ఉంటుంది. ప్రతి గర్భిణీ పూర్తిగా వినడానికి ప్రయత్నించాలి. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదైన గర్భిణి 01244451660 నంబరు నుంచి వాయిస్ కాల్ వస్తుంది. ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవిఆర్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒకరోజు మూడు సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుంది. ఆ సందేశాలను మళ్లీ వినాలి అనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేసి వినవచ్చు.

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కవిటి

మండలం బైరిపురంలో నూతనంగా నిర్మించిన యాదవ సామాజిక భవనాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి ఎమ్మెల్యే అశోక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే అశోక్ దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం ముందు జల్లుపుట్టులో రేషన్ డిపో ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బెందాలం రమేష్, మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, కొర్రాయి వాసుదేవ్, కడియాల వెంకటరావు, బార్ల చినబాబు , బెందాలం తిరుమలరావు, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, యర్ర బాసుదేవ్ ప్రధాన్, పండి దేవేంద్రమూర్తి, పొందల కృష్ణారావు, సదానంద రౌలో, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన విశ్వక్సేన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాద పూర్వ కంగా కలిశారు. నగరం లోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ప్రజాసదన్‌లో కలిసి ఆయనకు శాలువ కప్పి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

శాలువతో సత్కరిస్తున్న విశ్వక్సేన్

ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

ఎమ్మెల్యేను కలిసిన రెవెన్యూ అధికారులు

లావేరు: స్థానిక మండల రెవెన్యూ అధికారులుగా ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన ఉప తహశీల్దార్ డబ్బీరు శ్రీనువాసరావు, రీసర్వే డిటిగా బాధ్యతలు చేపట్టిన ఎన్. తిరుపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పలరాజులు ఆదివారం ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావును టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజల పనులు పెండింగ్ లేకుండా త్వరితగతిన చేయాలన్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు మంజూరులో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్యాలయ సిబ్బంది రత్నాకర్, కీర్తి వెంకటరమణ, భాస్కరరావు, విఆర్‌ఒలు ఉన్నారు.

ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆమదాలవలస మండలం తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శ్రీకాకుళం నగరంలోని హోటల్ గ్రాండ్‌లో జరిగింది. ఆదివారం జరిగిన ఈ కలయిక మధురంగా కొనసాగింది. నాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకుని క్షేమ సమాచారాలను పంచుకున్నారు. ముందుగా అలనాటి పూర్వ విద్యార్థుల్లో వివిధ రూపాల్లో అర్థాంతరంగా తనువు చాలించిన మిత్రులను స్మరించుకుని వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమానికి బాబూరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆనందోత్సవాల మధ్య సాగిన ఈ కార్యక్రమానికి జామి ఉమా మహేశ్వరరావు, విశ్వనాథం, టి.సత్య నారాయణ, టి.గోవిందరావు, కె.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి అభినందనలు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల నేపాల్ దేశం పొకార పట్టణంలోని రంగసామి అంతర్జాతీయ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని హోమియో నగర్ కాలనీలో నివాసముంటున్న క్రీడాకారుడు ఎస్.ఎన్.సుధాకర్ పాల్గొన్నారు. పదో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 60 నుంచి 65 ఏళ్ల వయసు వారికి ఈ పోటీలు నిర్వహించారు. సుధాకర్ మూడు, ఐదు, పది కిలోమీటర్ల నడక పోటీల్లో, రేస్ వాకింగ్‌లో మూడు బంగారు పతకాలు గెలుపొందారు. దీంతో కేంద్ర పౌర విమానయనశాఖ మంత్రి కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు ఆదివారం అబినందించారు. సుధాకర్ గతంలో 2019లో మలేషియా, 2023లో శ్రీలంక, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలను గెలుపొంది దేశానికి గుర్తింపు తెచ్చారని, గత 30 ఏళ్లుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నడక పోటీల్లో గెలుపొంది మంచిపేరు తెచ్చారని పేర్కొన్నారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తుల స్వీకరణ

పాతపట్నం: ఐసిడిఎస్ ప్రాజెక్టు పాతపట్నంలో 2024-25 సంవత్సరానికి మిషన్ వాత్సల్య పథకంలో స్పాన్సర్ షిప్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసిడిఎస్ పిఒ టి.విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు వైద్య, విద్య అభివృద్ధికి నెలకు రూ.4 వేలు అదనపు ఆర్థికసహాయం అందించడానికి అర్హత కలిగిన బాలల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి చివరి ఈ నెల 22 నాటికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 31 మార్చి 2025 నాటికి 18 ఏళ్లలోపు ఉండి, తల్లితండ్రిని కోల్పోయి ఇతర కుటుంబంలో నివసిస్తున్న అనాథ పిల్లలను, తల్లి తండ్రి ఇరువురు కేన్సర్, ఎయిడ్స్, డయాలసిస్ లాంటి ప్రాణాంతకర వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు, ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవలాంటి ప్రభుత్వ పథకాలు పొందని వారై ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లోని వారికి రూ.72 వేలు, పట్టణ ప్రాంతంలో ఉన్న వారికి రూ.96 వేలుకు మించి ఉండకూడదన్నారు. పై కేటగిరిలోని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న పిల్లలకు వర్తిస్తాయని తెలిపారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం అర్బన్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 97వ నెలవారీ సాహితీ సమ్మేళనర శాంతినికేతన్ కళాశాలలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవ సలహాదారు సురంగి మోహనరావు మాట్లాడుతూ తెరవే సంస్థ ద్వారా వెలువడిన పుస్తకములు ఎంతో ప్రాచుర్యం పొందాయని, ఇంకా మంచి రచనలతో పుస్తకాలు రావాలన్నారు. ప్రముఖ రచయిత్రి బలివాడ తేజస్విని, వాండ్రంగి కొండలరావు, కవులు డా.కోమలరావు, ఐ.ఎన్.డి ప్రసాద్, నిక్కు అప్పన్న, ఇద్దిపాపయ్య, గుడిమెట్ల గోపాల కృష్ణ, నిక్కు హరి సత్యాన్నారాయణ పాల్గొన్నారు.

సరదా చేసేనా.. దసరా!

- కానరాని పథకాలు
- దొరకని పనులు
- అప్పుల కోసం వేట

మూతపడిన గ్రానైట్ పాలిష్ యూనిట్

ప్రజాశక్తి- టెక్కలి

'దసరా వచ్చిందయ్యా సరదా తెచ్చిందయ్యా జయహో దుర్గాభవానీ' అని ఒక సినీ గేయ రచయిత రాసిన పాటలో అర్థం ఏమిటంటే దసరా అంటే సరదా అని కాని ఈ దసరా మాత్రం సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి సరదా తీసుకురావడం లేదని చెప్పవచ్చు. ఎందుకంటే నాలుగు మాసాల క్రితం రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాల ఫలితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజానీకంతో పాటు రైతాంగం ఆశలు కూడా నీరుగారి పోవడం కారణంగా పలువురు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జూలై నెల నుంచి అక్టోబర్ నెల వరకు పరిశీలీస్తే అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతుభరోసా వంటి పలు పథకాల ద్వారా ప్రజానీకానికి డబ్బులు చేరేవి. ఈ ప్రభుత్వ హయాంలో అవన్నీ లేకపోవడంతో పథకాలు అందుకునే సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం ఈ ఏడాది ఆర్థిక మాద్యంలో పడింది. పర్యవసానం ఏదో పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరడంతో దసరా పర్వదినాన్ని సరదాగా జరుపుకునే వారు. పథకాలు లేకపోవడం, కూలీ పనులు కూడా లేకపోవడం వంటి వాటితో వాటి మీదనే ఆధారపడే ప్రజలు దసరా పర్వదినం జరుపుకునేందుకు అప్పుల కోసం ఆరాట పడుతున్నారు.

దొరకని ఇసుక

రాష్ట్రంలో ఇసుక నూతన విధానం తీసుకురావడంతో భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక దొరకడం లేదు. దీంతో భవన నిర్మాణ పనులు చాలా వరకు నిలిచి పోయాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులకు రోజువారీ కూలీ దొరకడం కష్టతరంగా మారింది. గతంలో సంపాదించుకున్న డబ్బులు నిత్యావసర వస్తువులు కొనుగోళ్ళకే సరిపోవడం, ప్రస్తుతం పనులు లేక ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో పడుతున్నారు. ఇసుక లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో ఈ ప్రభావం భవన నిర్మాణానికి అను సందానంగా ఉన్న పెయింటింగ్స్, విద్యుత్, సీలింగ్, కర్రపని వంటి పనులపై ఆధారపడి వారిపై పడింది. ఒక్క ఇసుక దొరక్కపోవడంతో ఆ ప్రభావం పలు రంగాలపై పడడంతో వాటినే నమ్ముకున్న కార్మికులపై తీవ్ర ప్రభావం చూపింది.

పర్మిట్లు లేక

చాలా మంది కార్మికులు గ్రానైట్స్ పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆదికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రానైట్ పర్మిట్లు నిలిచిపోయాయి. దీని వలన పరిశ్రమనే నమ్ముకున్న కార్మికులకు ఉపాధి దొరకడం కష్టతరంగా మారింది. నెలల కాలం నుంచి పర్మిట్లు లేక పరిశ్రమలు మూతబడడంతో కార్మికులు వలసలకు పోయారు. దీంతో గ్రానైట్ పరిశ్రమకి అనుసంధానంగా ఉన్న పాలిషింగ్ యూనిట్లు, లారీ ట్రాన్స్‌పోర్టు, డీజిల్ అమ్మకాలు వంటి వాటిమీద పడడంతో వీటినే నమ్ముకున్న కార్మికుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పుడిప్పుడే పరిశ్రమలకు పర్మిట్లు మంజూరు అవుతున్నా కార్మికునికి పూర్తిస్థాయిలో ఉపాది దొరక్కపోవడం గమనార్హం. ఇది కూడా కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అలాగే సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామం వద్ద నిర్మాణం జరుగుతున్న పోర్టు నిర్మాణ పనులు కూడా నిలిచిపోవడంతో ఆ పనులపై ఆధారపడి జీవిస్తున్న కొన్ని వందల కుటుంబాలు కూడా నిరాశ్రయులుగా మారారు. దీంతో వారి బతుకుల్లో కూడా దసరా సరదా చీకటిగానే మిగలనుంది.

ఎరువుల భారం

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతాంగం పెట్టుబడులన్ని మట్టిలో పెట్టాల్సిన సమయం. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి అవసరమైన ఎరువులు వాటి ద్వారానే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు దొరికేవి. ఈ ఏడాది సచివాలయాలకి ఎరువులు పంపిణీ జరిగినా రైతుకు అవసరమైన ఎరువులు దొరకలేదని రైతులంటున్నారు. దీంతో ఎరువుల బస్తా బయట మార్కెట్లో కొనుగోలు చేయాలంటే అధిక ధరలకు అమ్మడంతో చాలా వరకు ఎరువులు కొనుగోళ్లకే డబ్బులు పెట్టుబడులుగా పెట్టడంతో రైతు కూడా ఆర్థిక భారంలో పడ్డాడు.

పాత ర్యాంపు వద్ద ఇసుకను ఏరుకుంటున్న కూలీలు

పెరిగిన ధరలు

గడచిన కొద్ది నెలల నుంచి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. పామాయిల్ ధర ఏకంగా రూ.30 పైబడి ధర పెరగడంతో పాటు మిగిలిన నిత్యావసర వస్తువుల ధరల్లో భాగంగా వంటగ్యాస్, పప్పుల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం ధరల భారాన్ని మోయలేని పరిస్థితిలో ఉంది.

అప్పుల కోసం ఆరాటం

పెరిగిన ధరలు, సంక్షేమ పథకాలు రాకపోవడం, కూలీ పనులు లేకపోవడంతో దసరా పండుగని జరుపుకోవాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో సంపాదించిన కాస్తోకూస్తో సోమ్ము పనులు లేని సమయానికే ఖర్చులకు అయిపోగా ప్రస్తుతం దసరా పండుగ రోజు సరదా కోసమైన డబ్బులు అవసరం కావడంతో అప్పుల కోసం ప్రజానీకం ఆరాటపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏదిఏమైనా రైతుల ముఖ్యమైన దసరా పండుగ సరదా గడపాలంటే ఆర్థిక మాంద్యం వెంటాడుతుండడంతో ప్రజానీకం ఆయోమయంలో పడుతుంది.

అరసవల్లి ఆదాయం రూ.3.95 లక్షలు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ ఆలయానికి ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో ఒక్కరోజున రూ.3.95 లక్షల మేర ఆదాయం సమ కూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.1,47,500, విరాళాల ద్వారా రూ.80,709, ప్రసాద విక్రయాల ద్వారా రూ.1,67,045 ఆదాయం వచ్చినట్టు ఇఒ భద్రాజీ తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి ఆర్థికసాయం

లావేరు: మండలంలోని గుమ్మడాం పంచాయతీ నాగం పాళెంలో నూతనంగా నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహనికి ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగంపాళెం గ్రామ యువతకు టిడిపి నాయకుడు మజ్జి రామూర్తి ఆధ్వర్యంలో రూ. పది వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు యువత కృతజ్ఞతలు తెలిపారు.

'పద్మావతి'లో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం

నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల ప్రతిష్ఠాత్మక ఐఐటి చెన్నైతో స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం కోసం ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా తమ కళాశాలలో చదువు తున్న ఇంటర్ విద్యార్థులు మద్రాస్ ఐఐటి అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్ సర్టిఫికెట్ కోర్సులు ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసే వీలు కలుగు తుందన్నారు. ఎనిమిది వారాలు గల ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు మద్రాస్ ఐఐటి సర్టిఫికెట్‌తో పాటు ఐఐటి క్యాంపస్ సందర్శించే అవకాశం ఉంటుందని తెలిపారు.

నెహ్రూ పార్కును అభివృద్ధి చేయాలి

పలాస: పలాసలో ఉన్న నెహ్రూ పార్కును అభివృద్ధి చేయాలని వాకర్స్‌క్లబ్ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావును కోరారు. నెహ్రూ పార్క్ (ముత్యాలమ్మ కోనేరు) వాకర్స్ క్లబ్ తరుపున కలిసి పార్క్ సమస్యలు, చుట్టూ పెన్సింగ్, లైటింగ్, వాటర్ క్లోరినేషన్, మందుబాబులు చేపడుతున్న అసాంఘిక కార్యక్రమాలు వంటి సమస్యలను బాబూరావుకు వివరించారు. దీనిపై బాబురావు స్పందించి పార్క్ సమస్యలను కమిషనర్‌కు తెలియజేసి పార్క్ అభివృద్ధి, సమస్యల పరిష్కారం చేస్తానని వాకర్స్‌కు హామీ ఇచ్చారు.

ఇకెవైసి తప్పనిసరి

సోంపేట: రైతులంతా తమ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో పాటు ఇకెవైసి చేయించుకోవాలని మండల ఎఒ నరసింహమూర్తి కోరారు. మండలంలోని టి.శాసనలో జరుగుతున్న ఇకెవైసి ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 9,039 ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందన్నారు. ఇప్పటివరకు 8,600 ఎకరాలకు సంబంధించి ఇకెవైసి పూర్తయిందని తెలిపారు. మిగిలిన వారు సైతం చివరి రోజు అయిన సోమవారం నాటికి ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఇకెవైసి చేసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను ఇప్పించరూ...

కవిటి: బెంతు ఒరియా విద్యార్థులకు ధ్రువపత్రాలు జారీ చేయని కారణంగా విద్యా, ఉపాధి అవకాశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సమస్యను గుర్తించి నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం న్యాయం చెయ్యాలని బెంతు ఒరియాల యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి డిమాండ్ చేశారు. ఆదివారం దీక్షలో కంచిలి మండలం తలతంపర సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి, సంతోష్ దొళాయి ఆధ్వర్యంలో లొండపుట్టుగ గ్రామ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ బిసాయి మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు.

థర్మల్ ఉద్యమ పుస్తకావిష్కరణ

సోంపేట : సోంపేటలో జరిగిన థర్మల్ పోరాట ఉద్యమానికి సంబంధించి మానవ హక్కుల వేదిక సభ్యులు అనురాధ రచించిన బీల కోసం, బతుకు కోసం అనే పుస్తకావిష్కరణను ఆదివారం హైదరాబాద్‌లో చేపట్టారు. సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సోంపేట నుంచి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను అక్కడి వారితో పంచుకున్నట్లు కృష్ణ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో బార్ల సుందరరావు, టి.రామా రావు, బి.రంగనాథం, పండి దానయ్య, నారాయణ, నిట్ట గోపాల్, టి.కోదండరావు, డి.దీనబందు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, తదితరులు

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

మాట్లాడుతున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సహాయం అందించేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు అన్నారు. ఆదివారం మండలంలోని సుఖదేవుపేటలో కొల్లి రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు సాగుదారులైన కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులు ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు అమ్ముతున్నరని, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు రైతులకు అందజేయాలన్నారు. సమావేశంలో నంబూరు షణ్ముకరావు, బగాది వాసుదేవరావు, జర్జంగి బాలరాజు, బొడ్డు భీమారావు, బి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, లిక్కర్ మాఫియాకు అండ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇసుక, లిక్కర్ మాఫియాకు నియోజకవర్గాన్ని అడ్డాగా తయారు చేసి ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ప్రతిరోజు యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు తెగ బడుతున్నారన్నారు. గడచిన రెండు రోజులుగా మద్యం షాపులకు టెండర్లు వేసే వ్యక్తులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలా బెదిరించి నియోజకవర్గంలోని షాపులన్ని ఆయన గుప్పిట్లో పెట్టుకొని మద్యాన్ని అధిక ధరలకు అమ్మి కోట్ల రూపాయలు సంపాదించేలా ఒక మాఫియా ముఠాను తయారు చేస్తున్నారన్నారు. ఇటువంటి సంస్కృతి ఇంతవరకు నియోజకవర్గంలో లేదని ఇది మంచి సాంప్రదాయం కాదన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాసేవకు వినియోగించాలని కోరారు. తొందరలోనే మాఫియా ఆగడాలను ప్రణాళికా బద్ధంగా అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ బుడుమూరు రామ్మోహన్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రవికుమార్

కిడ్నీ వ్యాధి నియంత్రణకు కృషి చేయాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ చలం తదితరులు

ప్రజాశక్తి- పలాస

ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని, అందుకోసం ప్రజాఉద్యమం సాగాలని ప్రొఫెసర్ కెహెచ్ చలం పిలుపునిచ్చారు. పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన కోరారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం, కళింగసీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ సభలో ప్రొఫెసర్ చలం ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పలువురు కవులు, రచయితల రచన సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. పౌర సమాజమంతా మేల్కొని కిడ్నీవ్యాధి నివారణ కోసం మేల్కోవాలన్నారు. కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పుస్తక సంపాదకులు బద్రి కూర్మారావు, పలువురు వైద్యులు డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ ఆనంద్, డాక్టర్ గిరిబాబు, పలువురు రచయితలు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 1న పాఠశాలలో పెండింగ్ పాఠ్య పుస్తకాలు ఇస్తున్నప్పుడు విద్యార్థులు సక్రమంగా వరుసలో లేరని టీచర్ ఒక విద్యార్థిని కర్రతో కొట్టగా కర్రపుల్ల విరిగి వెనుక నిల్చున్న పెసరపాలెం గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి చెన్నకుమార్ కంటికి గుచ్చుకోవడంతో కంటికి తీవ్రంగా గాయమై కంటి నుంచి రక్తస్రావమై విద్యార్థి కన్ను ఎర్రగా మారటంతో విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం పెసరపాలెం వెళ్లి కంటికి గాయమైన విద్యార్థి తండ్రి చెన్న నాగరాజును సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. అమ్మన్నాయుడు పరామర్శించి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని, విద్యార్థికి, విద్యార్థి కుటుంబానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శిస్తున్న అమ్మన్నాయుడు

కేశుపురంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం కేశుపురం పంచాయతీలో ఐటిడిపి నాయకుడు నరేంద్ర రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బి.అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత వైద్య శిబారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేశుపురం, సన్యాసిపుట్టుక, నీలాపుపుట్టుక గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 26 మంది రక్తదానం చేశారు. వైద్యులు ఉంగా సాయికుమార్ బృందం వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, దక్కత కామేశ్వరరావు, ఎస్.సహదేవ్ రెడ్డి, బి.రాజేంద్రప్రసాద్, యువరాజు, పి.దుర్యోధన, హరీష్, ఎస్.గణపతి, ఆర్.సోమేష్, బి.శ్యామ్, పి.జగన్నాథం, ఎం.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే అశోక్

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

లారీని ఢీకొట్టిన పికప్ వ్యాన్

మండల కేంద్ర సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఆదివారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. ఆమదాలవలస నుంచి హిరమండలం వైపు వెళ్తున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన భారీ వాహనం అలికాం, బత్తిలి ప్రధాన రహదారిపై ఉన్న గుంతల వద్ద ఒక్కసారి ఆగిపోయింది. అదే లారీ వెనుక హిరమండలం వైపు వెళ్తున్న బొలెరో పికప్ లగేజీ వ్యాన్ లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీ కొట్టింది. లారీ గుంతల వద్ద నెమ్మది కావడంతో వ్యాన్ ముందు భాగం నుజ్జు అయినప్పటికీ ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. లారీని వ్యాన్ ఢీకొన్న సంఘటన చూసిన ప్రతిఒక్కరూ భారీ ప్రమాదం జరిగి ఉంటుందని భావించి సంఘటన స్థలానికి పరుగులు తీశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇరు గ్రూపులపై కేసుల నమోదు

పొందూరు: పట్టణంలోని కళాంజలి థియేటర్ సమీపంలో నూతనంగా దుకాణం ఏర్పాటు పనుల విషయంలో దుకాణం యజమాని, వెల్డింగ్ కార్మికుల మధ్య పరస్పర దాడి, దూషణలకు సంబంధించి ఇరు గ్రూపులు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. దుకాణం షట్టర్ లాక్‌లు ఏర్పాటు చేయడం, వాటి నగదు విషయంలో ప్రశ్నించడంతో తనపై వెల్డింగ్ కార్మికుడు నాని, ఆయన భార్య రమణమ్మలు దాడి చేశారంటూ దుకాణం యజమాని వికాస్ ఫిర్యాదు చేశాడు. అలాగే తాను మహిళనని చూడకుండా దుకాణం యజమాని అసభ్య పదజాలంతో దూషించి, బెదిరించాడంటూ వెల్డింగ్ కార్మికుని భార్య రమణమ్మలు ఫిర్యాదు చేశారు. ఇరుగ్రూపులు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జెడ్‌పిటిసి మానవత్వం

సోంపేట: మండలంలోని పాలవలస గ్రామ జాతీయ రహదారి వద్ద ఆదివారం ఉద యం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయ పడిన క్షత గాత్రుడిని జెడ్‌పిటిసి తడక యశోద, ఫలసపురం సర్పంచ్ తడక జోగరావులు ఆస్పత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పొందర వెంకటరావు రోడ్డు ప్రమాదానికి గురై రహదారి పక్కనే పడిపోయాడు. అటుగా వెళ్తున్న జెడ్‌పిటిసి యశోద గమనించారు. వెంటనే భర్త జోగా రావుతో పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరి పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యార్థులు కథలు చదవాలి

లావేరు : ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థి కథలు చదవడం నేర్చుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులు తమకు తెలిసిన కథలను చదివి వినిపించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ

నందిగాం: మండలంలోని 37 పంచాయతీల్లో గల వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లకు ఈనెల 7, 8 తేదీల్లో రిఫ్రెషర్‌పై శిక్షణ ఇవ్వబడుతుందని ఎంపిడిఒ టి. రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించ బడుతుందని, మండలంలోని వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లు విధిగా హాజరు కావాలన్నారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో ఈ నెల 7 8 తేదీల్లో వార్డు మెంబర్లకు, ఉపసర్పంచ్‌లకు శిక్షణ ఉంటుందని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం షాపులకు దరఖాస్తులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇచ్ఛాపురం, కవిటి మండలం, మున్సిపాలిటీ పరిధిలో మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 9న చివరి తేదీ అని ఎక్సైజ్ సిఐ పి.డి.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 12 నుంచి కొత్తగా ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహణకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 9 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ రెండు, మండలం మూడు, కవిటి మండలంలో మూడు షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఒక్క దరఖాస్తుకు రెండు లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. లాటరీలో పద్ధతిలో షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు.

వజ్రపుకొత్తూరు : శ్రమదానం చేస్తున్న యువకులు

జనసైనికుల శ్రమదానం

రణస్థలం: మండలంలోని దేరసాంలో జనసేన పార్టీ నాయకులు ఆదివారం శ్రమదానం చేశారు. గ్రామం మధ్యలో ఎన్నోఏళ్లుగా పాఠశాలకు వెళ్లే రహదారి మధ్యలో మట్టి నిల్వ ఉండటంతో చిన్నచిన్న వర్షాలు వచ్చినా ఆ మార్గం మొత్తం బురదమయంగా మారడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. వర్షాలకు వర్షం నీరు ఇళ్లల్లోనికి రావడంతో గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడేవారు. స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జనసేన నాయకుడు దన్నాన రవీంద్ర ఆధ్వర్యంలో జెసిబితో మట్టిని పూర్తిగా తొలగించి ఎన్నోఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం చేయడంతో గ్రామస్తులు జనసేన నాయకులను అభినందించారు.

యువకులు...

వజ్రపుకొత్తూరు: మండలంలోని పల్లిసారథి-గొల్లసారథి మధ్య రహదారి పూర్తిగా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో అల్లుకుపోయింది. దీంతో పల్లిసారథికి చెందిన జన చైతన్య ఆర్ట్స్ యువజన సంఘం సభ్యులు స్పందించి ఆదివారం శ్రమదానంతో పిచ్చిమొక్కలను తొలగించారు. రహదారి బాగు చేసిన యువజన సంఘం సభ్యులను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వాసుదేవ్, ఉదయ్‌కుమార్, హేమంతరావు, ధర్మారావు, వనమాలి గణపతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.